క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి కృషి



కామారెడ్డి అర్బన్: తాను చదువుకున్న కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. శనివారం కళాశాల వార్షికోత్సవంతో పాటు ఇతర అంశాలపై కళాశాల విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్‌తో చర్చించేందుకు ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య, అధ్యాపకులు హైదరాబాద్ వెళ్లారు. అనంతరం నూతన సచివాలయం ఎదుట కళాశాల అకడమిక్ కరపత్రాలను నవీన్ మిట్టల్‌తో పాటు డైరెక్టర్ సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.చంద్రకాంత్, వి.శంకర్, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హాని కలిగించే ఫ్యాక్టరీని మూసేయాల్సిందే



భిక్కనూరు: పర్యావరణానికి హాని కల్గించే ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీని మూసివేయాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్‌లో చేపట్టిన నిరసన దీక్షకు కాంగ్రెస్ నాయకులు మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి శనివారం వారు నిరసన దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ధర్మయ్య, సిద్ధరాములు, నర్సింలు, సిద్ధగౌడ్, బాబు, రమేశ్, మల్లేశం పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



రాజంపేట: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో బాలకిషన్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. సోమవారం పెద్దాయిపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత తప్పనిసరి



నాగిరెడ్డిపేట: వివోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివోఏలు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారికి నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలన్నారు. వివోఏల మండల అధ్యక్షుడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని లింగంపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద వీవోఏలు ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా సెర్ప్‌లో పని చేస్తున్నా కనీస వేతనం అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు ఉమాకాంత్, పద్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కో కన్వీనర్ నియామకం



తాడ్వాయి: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కో కన్వీనర్‌గా తాడ్వాయికి చెందిన మంగళి రాజును నియమించారు. సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

దోమకొండ: రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. దోమకొండలో గుండెపోటులో మృతి చెందిన రైతు కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను ఆయన శనివారం పరామర్శించారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు ఇతర రాష్ట్రాల్లో రూ. లక్ష ఇస్తున్నా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎలాంటి సహాయం అందించడం లేదన్నారు. ఆయన వెంట నాయకులు చందు, అబ్రబోయిన స్వామి, అనంతరెడ్డి, సీతారం మధు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన మరాఠి నారాయణ, బెస్త శ్రీనివాస్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ హైమద్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ దర్మారెడ్డి పంపిణీ చేశారు.

అమాత్యా..! హామీ గుర్తుందా?

- దోమకొండలో డిగ్రీ కళాశాల ఏర్పాటు హామీకి ఆరేళ్లు
- డిగ్రీ చదవాలంటే 50 కిమీ దూరం ఉన్న కామారెడ్డికి వెళ్లాల్సిందే
- తప్పని పరిస్థితుల్లో ఇంటర్‌తోనే చదువు ముగిస్తున్న బాలికలు



దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, వీటి ఆవరణలోనే డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించారు

దోమకొండ: మండల కేంద్రమైన దోమకొండలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆరేళ్ల కిందట హామీ ఇచ్చారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని 2017లో జేఏసీ ఆధ్వర్యంలో వంద రోజులు దీక్షలు చేశారు. 2017 జూన్‌లో వివిధ పార్టీల నాయకులు మంత్రి హరీశ్‌రావ్‌తో పాటు ఎంపీ బీబీపాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీని కలిసి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీక్షలకు ప్రొఫెసర్ కొదండరాంతో పాటు, విమలక్క, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే రఘునందర్‌రావ్ తదితరులు మద్దతు తెలిపారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హామీ ఇచ్చి దీక్షలను విరమింపజేసి ఆరేళ్లు అయినా ఇప్పటికీ కదలిక లేదు. బీబీపేట, దోమకొండ, భిక్కనూరు, మాచారెడ్డి మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల్లో ఇంటర్ చదువుతున్నారు. అయితే డిగ్రీ కళాశాల స్థానికంగా లేకపోవడంతో 50 కిమీ దూరంలో ఉన్న కామారెడ్డికి వెళ్లాల్సిన పరిస్థితి. ఆర్థిక పరిస్థితులతో పాటు డిగ్రీ చదివేందుకు సుదూర ప్రాంతమైన కామారెడ్డికి వెళ్లలేక దాదాపు 80 శాతం మంది బాలికలు ఇంటర్‌లోనే చదువు మానేస్తున్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేందుకు 10 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా డిగ్రీ కళాశాల ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నా కుమార్తె చదువు మాన్పించా



నా కుమార్తె ఇంటర్ దోమకొండలో చదివింది. డిగ్రీ చదవాలంటే కామారెడ్డికి వెళ్లాల్సి ఉంది. అంతదూరం వెళ్లి తిరిగి వచ్చేందుకు ఇబ్బంది. అందుకోసమే ఇంటర్‌తోనే చదువు మాన్పించాను. స్థానికంగా డిగ్రీ కాలేజీ లేక చాలా మంది బాలికలు చదువు మధ్యలో మానేస్తున్నారు.

–సామల నర్సింలు, దోమకొండ

పాలకులు స్పందించాలి



డిగ్రీ కళాశాల కోసం 2017లో వంద రోజుల పాటు రిలే దీక్షలను చేశాం. వెంటనే ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు దీక్షను విరమింపజేశారు. హామీ ఇచ్చి ఆరేళ్లు అయినా పట్టించుకోవడం లేదు.

–చింతల రాజేష్, దోమకొండ

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

మాచారెడ్డి: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. శనివారం మాచారెడ్డి మల్లిఖార్జునస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాచారెడ్డి గ్రామం తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులు తప్ప కొత్తగా చేసిందేమీ లేదని పరోక్షంగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను విమర్శించారు. కల్లాల్లో మొలకెత్తిన ధాన్యాన్ని చూస్తుంటే గుండె తరుక్కు పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను రద్దుచేసి భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వర్షాలకు నష్టపోయిన రైతులకు బీమా అందిస్తామన్నారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు గణేష్ నాయక్, నాయకులు నౌజిలాల్, శ్యామ్ సుందర్ రెడ్డి, గోరంటాల భాస్కర్ గౌడ్, రామచంద్రం పాల్గొన్నారు.

భ్రష్టు పట్టిన విద్యా వ్యవస్థ

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి పేపర్లు లీక్ చేసి సొమ్ము చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో ఓపెన్ పరీక్షల్లో రూ. కోటికి పైగా విద్యార్థుల నుంచి వసూలు చేశారని, అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంట్లో ప్రత్యక్షమైన మర్నాగి

నాగిరెడ్డిపేట: మండలంలోని ఆత్మకూరులో శనివారం షాదుల్‌బాబా ఇంటి పైకప్పుపై మర్నాగి ప్రత్యక్షమైంది. సమీపంలోని పంట పొలాల నుంచి మర్నాగి నేరుగా ఇంటిలోకి రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. సర్పంచ్ బాల్‌రెడ్డి సహకారంతో అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. వారు వచ్చేలోగా మర్నాగి ఇంటి నుంచి బయటకు వెళ్లి పోయింది.



ఇంటి పైకప్పు వద్ద ఉన్న మర్నాగి

పాఠశాల నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న రైతుబంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి

బాన్సువాడ రూరల్: గురుకుల పాఠశాలలు, కళాశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ఉన్నాయని రైతుబంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొయ్యగుట్ట తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన స్పార్కెల్స్ సమ్మర్ కోచింగ్ ముగింపు సమావేశానికి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయినుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి అనుగుణంగా కష్టపడి చదువాలని సూచించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, నాయకులు ఎజాస్, పిట్ల శ్రీధర్, బాలక్రిష్ణ, రాజశేఖర్, అయ్యాల సంతోష్, సందుల గంగారాం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



గాంధారిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్



పిట్లం మండలం అన్నారంలో..



కామారెడ్డి మండలం లింగాపూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మొక్కజొన్న విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. రైతులెవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. గాంధారిలో సింగిల్ విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధాబలరామ్ గాంధారి, పోతంగ్‌ఖుర్దు, పేట్‌సంగెం, మాతు సంగెం, బ్రాహ్మణ్‌పల్లి, గుర్జాల్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నిట్టు లింగారవు, పీఏసీఎస్ డైరెక్టర్ నిట్టు శంకర్‌రావు, ఏఎంసీ డైరెక్టర్ బండారి సర్పారెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా పిట్లం మండలం అన్నారం గ్రామంలో సహకార సంఘం చైర్మన్ శపథంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ కాశీరాం తదితరులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యాపరంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

కామారెడ్డి అర్బన్: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.రాజేశ్వర్ సూచించారు. శనివారం రాఘవపూర్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ, పెద్దిరాజుల జాతర ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాయవాది గజ్జెల భిక్షపతి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. కార్యక్రమంలో రాఘవపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు రాజు, సునీల్ పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ సిబ్బంది

లింగంపేట: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం ట్రాన్స్‌కో సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. స్వయంగా ఎవరూ మరమ్మతులు చేసుకోవద్దని పేర్కొన్నారు. జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్‌ను ఆదా చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ రెడ్డి, ఇంచార్జి ఏఈ అశోక్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిష్టయ్య, లైన్‌మెన్ మనోహర్, జేఎల్‌ఎం రాజు, ప్రశాంత్, నాయకులు కిరణ్, రాంచందర్ పాల్గొన్నారు.

కార్యవర్గం..

■ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియామకం



భిక్కనూరు: కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా ఇసన్నపల్లి గ్రామానికి చెందిన తిర్మల్‌స్వామిని నియమించారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ శనివారం ఆయనకు నియమాక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పటిష్టతకు కృషి చేయాలని ఆయనకు సూచించారు.

విరబూసిన 'మే' పుష్పం



పట్టణంలోని కాకతీయ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న కవి, రచయిత సిరిగాధ శంకర్ ఇంట్లో మే పుష్పం విరబూసింది. ప్రతి యేటా మే నెలలో పుష్పం పూస్తుందని ఆయన తెలిపారు. పుష్పం చూపరులను ఆకర్షిస్తోంది.

– కామారెడ్డి టౌన్

వంటా వార్పూ శిబిరంలోనే..



కామారెడ్డి: పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్



గాంధారిలో బతుకమ్మ ఆడుతూ నిరసన..

సాక్షి, నెట్‌వర్క్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. డిమాండ్లు సాధించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. శిబిరాల్లోనే వంటా వార్పూ చేసి అక్కడే భోజనం చేశారు. మహిళా కార్యదర్శులు బతుకమ్మ ఆడారు. సమ్మెకు కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు.



జుక్కల్‌లో సీపీఎం నాయకులు..



లింగంపేటలో శిబిరంలోనే భోజనం చేస్తూ..



పిట్లం: కార్యదర్శులకు కాంగ్రెస్ నేతల మద్దతు..



కామారెడ్డి: మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి వెంకటరమణారెడ్డి

ఆధ్యాత్మికం

■ వైభవంగా రథోత్సవం



మద్నూర్: మండల కేంద్రమైన మద్నూర్ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం వద్ద శనివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హన్మంత్‌సింధే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలను ఎమ్మెల్యే తిలకించి గెలిచిన వారికి నగదు బహుమతి అందజేశారు.

■ నరసింహస్వామి ఆలయంలో చక్రతీర్థం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహాకుంభ ప్రోక్షణ, చక్రతీర్థోత్సవ కార్యక్రమాలను ని ర్వహించారు. అనంతరం ఏకాంత సేవను భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో ప్రభు పాల్గొన్నారు.

■ నేటి నుంచి ఉత్సవాలు

కామారెడ్డి రూరల్: మండలంలోని లింగాపూర్ గ్రామం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర ఆలయ ఐదవ వార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలకు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, మాజీ మంత్రి షబ్బీర్అలీ, బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిలు హాజరవుతారని తెలిపారు.

■ రేణుకా ఎల్లమ్మ..



నిజాంసాగర్: మండలంలోని అచ్చంపేట రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు ఉంటాయని ఆలయ నిర్వాహకులు బంగ్ల ప్రవీణ్ తెలిపారు.

■ కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



రాజంపేట: మండల కేంద్రమైన రాజంపేట శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర సెన్సార్ బోర్డ్ సభ్యులు అతిమాముల రామకృష్ణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సేవాసమితి సభ్యులు మహేష్ పంతులు, బొర్ర నరేష్ గౌడ్, కిరణ్ కుమార్, పందుల స్వామి, కొప్పుల నరేష్ పాల్గొన్నారు.

■ హరినామ సప్తాహం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని నాగుల్‌గావ్ గ్రామంలోని హరినామ సప్తహ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పాల్గొని స్థానికులతో కలిసి భజనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కపిల్ పటేల్, నాయకులు నీలుపటేల్, రవి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

■ మహరాజ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే



పిట్లం: మండల కేంద్రంలోని రాధాస్వామి సత్సంగ్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పరమ సంత్ దయాళ్ స్వరూప్ ఆనంద్‌రావ్ మహారాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండాలి

బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపులో ఉన్న సాంఘీక సంక్షేమ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శనివారం మండల ప్రజాప్రతినిధులు పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్ చందర్‌కు సూచించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌గౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డి: దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన చేస్తామని ఎంఎస్పీ నాయకులు సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు డిమాండు చేస్తూ శనివారం ఎల్లారెడ్డిలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకులు పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అంతానికి కృషి

వర్ని: దేశంలో అవినీతి అంతానికే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని మాజీ ఎంపీ, బీజేపీ ఉమ్మడి జిల్లా ప్రభారి బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. వర్నిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రగతి భవన్ కేంద్రంగా అవినీతికి శిక్షణ ఇస్తుంటే నియోజకవర్గంలో అవినీతి సబ్ సెంటర్ కొనసాగుతోందని ఆరోపించారు. వర్షాలతో రైతన్న నష్టపోతుంటే సీఎంకు చీమకుట్టినట్లైనా లేదన్నారు. రైతు సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలపై విచారణ చేపట్టి అవినీతిపరుల అంతం చూస్తామని అన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బసవ లక్ష్మీ నర్సయ్య, కామారెడ్డి అధ్యక్షురాలు అరుణతార, కొత్తకొండ భాస్కర్, మాల్యాద్రి రెడ్డి, భూపాల్ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ



బుడ్మిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ రూరల్: మండలంలోని బుడ్మి గ్రామంలో రూ.20 లక్షలతో మున్నూరుకాపు సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం అంబా భవానీ మాత జాతర మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలను తిలకించారు. అందరూ ఒక్కతాటిపై ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని, అందుకు తనవంతు సహకారం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు పిట్ల శ్రీధర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.